## క్లుప్తంగా

### కొమెరబత్తినకు కాసు పరామర్శ



దాచేపల్లి: వైఎస్సార్ సీపీ నాయకుడు కొమెరబత్తిన ఆనంద్‌కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్న ఆనంద్‌కుమార్‌ని నారాయణపురంలోని ఆయన ఇంటికి వెళ్లి కాసు పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### పేద కుటుంబానికి చేయూత

మాచర్ల: స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గురు వృద్ధులకు దుస్తులు, నిత్యవసర సరుకులు అందజేసినట్లు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. పీడబ్ల్యూ కాలనీలోని జడ్పీ బాయ్స్ హైస్కూల్ ఎదురుగా ఒక పూరి గుడిసెలో నివాసం ఉంటున్న దేరంగుల వెంకటేశ్వర్లు, భార్య అంజమ్మ, కుమార్తె మానసిక వికలాంగురాలు లక్ష్మీలకు నూతన వస్త్రాలు, నిత్యవసర సరుకులు అందజేశామన్నారు. అంతేకాకుండా దేరంగుల వెంకటేశ్వర్లు భార్య అంజమ్మకు రెండు కళ్ళు ఉచితంగా శుక్లాలు తీపించి ఆపరేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. మానసిక వికలాంగురాలైన కుమార్తెకు కూడా మానసిక వికలాంగుల పెన్షన్ వచ్చే విధంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ప్రతినెల బియ్యం, నిత్యాస సరుకులు, అందజేస్తామన్నారు.

### కమిషనర్‌కు అభినందనలు

మాచర్ల: మాచర్ల మున్సిపల్ కమిషనర్ ధూళ్లిపాళ్ల వేణుబాబు బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. కమిషనర్ వేణుబాబు మాట్లాడుతూ తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

### ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేత

పిడుగురాళ్ల: ఆటో డ్రైవర్లకు ఎమ్మెల్యే యరపతినేని చేతుల మీదుగా శనివారం నగదుకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అనంతరం పిడుగురాళ్ల పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు గోకుల షెడ్‌లకు భూమిపూజ

కారెంపూడి: గోకుల షెడ్‌ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసేందుకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం ఉదయం కారెంపూడి రానున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, ఏపీఓ కె.నాగేశ్వరరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కారెంపూడి గ్రామానికి ఈ ఏడాది రెండవ విడత 37 గోకుల షెడ్‌లు మంజూరయ్యాయని వాటి నిర్మాణ పనులను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

### పేటసన్నెగండ్లలో భూముల రీ సర్వే



కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో సోమవారం నుంచి భూముల రీ సర్వే జరగనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. ఈ మేరకు గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంతో కాలంగా ఉన్న భూ సమస్యల పరిష్కారం రీ సర్వే లభిస్తుందని గ్రామంలోని రైతులు ప్రజలు రీ సర్వేకు సహకరించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు. గ్రామ పెద్దలు, వీఆర్‌ఓలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

### ఫ్యాప్టో పోరుబాటను విజయవంతం చేయాలి



సత్తెనపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ చలో విజయవాడ పేరుతో ఈనెల 7న జరిగే ఫ్యాప్టో పోరుబాటను విజయవంతం చేయాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్‌ఎం సుభాని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు సత్తెనపల్లిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం అన్ని ఉపాధ్యాయ సంఘ నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 12వ పీఆర్సీ, 30 శాతం ఐఆర్, డీఏ, ఎరియర్స్, కారుణ్య నియామకాలు, ఏకీకృత సర్వీస్ రూల్స్, సీపీఎస్ రద్దు, అసెస్‌మెంట్‌బుక్స్ విధానం రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌లను సాధించాలంటే వేలాది సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని ఫ్యాప్టో పోరుబాటను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మక్కెన శ్రీనివాసరావు, చిన్నం శ్రీనివాసరావు, బి. శ్రీనివాసరావు, సీహెచ్. అగష్టస్‌బాబు, సీహెచ్. శ్రీనివాసరావు, పి. రమేష్ బాబు, ఎం. అప్పారావు, టి.శరత్, సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో పడకేసిన పాలన

- రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకింగ్‌లో దాచేపల్లికి 92, పిడుగురాళ్లకు 110 ర్యాంకులు రావటం దారుణం
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో పాలన పడకేసిందని, దారుణమైన పాలనతో దాచేపల్లి నగర పంచాయతీకి 92, పిడుగురాళ్ల మున్సిపాలిటీకి 110 ర్యాంకులు వచ్చాయని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్ నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంతో పట్టుదలతో గ్రామంగా ఉన్న దాచేపల్లిని నగర పంచాయతీగా చేసి అభివృద్ధిలో పరుగులు పెట్టించామని, మున్సిపాలిటీగా ఉన్న పిడుగురాళ్లలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. గత ప్రభుత్వ పాలనలో రూ.వందల కోట్ల వ్యయంతో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందించామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాలంలో నగర పంచాయతీలు, మున్సిపాలిటీలలో పాలనా దారుణంగా మారిందని, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ దారుణ పనితీరుతో దాచేపల్లి, పిడుగురాళ్లకు అతిదారుణమైన ర్యాంకులు వచ్చాన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రజలకు జవాబు చెప్పాలన్నారు.

**తాగునీటికి కటకట..**

దాచేపల్లి నగర పంచాయతీ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే నారాయణపురం – నడికుడి రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు తాము చేపట్టామని, మిగిలిన కొద్దిపాటి పనులు కూటమి ప్రభుత్వంలో చేస్తున్నారన్నారు. ఈ రోడ్డు విస్తరణ కోసం ఆరు నెలల క్రితం తొలగించిన పైపులైన్లను ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవటం వలన ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఇళ్ల ముందు నీళ్ల డ్రమ్ములు పెట్టుకుని ట్యాంకర్లలో వచ్చిన నీళ్లను పట్టుకుని కాలం గడుపుతున్నారని ఆయన చెప్పారు. ఈ రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయాలని నగర పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవటంలేదని మహేష్‌రెడ్డి దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం హయాంలో దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ16.50 కోట్ల నిధులు మంజూరు చేస్తే ఆ పనులు పూర్తి చేయలేని దుస్థితిలో ప్రభుత్వ కూటమి ప్రభుత్వం ఉందని మహేష్‌రెడ్డి ధ్వజమెత్తారు.

**మంచినీళ్లు లేవు.. అంతా మద్యమే..**

కూటమి ప్రభుత్వంలో మైనింగ్, మద్యంతో పాటుగా ఇతర వ్యాపారాలన్నీ స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నీ తానై చేసుకుంటున్నాడని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించారు. మంచినీళ్లు ఇవ్వమని ప్రజలు కోరుకుంటుంటే టీడీపీ నాయకులు మాత్రం మద్యం ఏరులై పారిస్తున్నారన్నారు. కుటీర పరిశ్రమలను తలదన్నే విధంగా వీధికొక బెల్ట్‌షాపు పెట్టి అక్రమంగా మద్యం విక్రయాలు భారీ ఎత్తున చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ఓటువేసి మోసపోయామని ప్రజలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారని ఆయన చెప్పారు. 2029లో తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావటం తథ్యమని, రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలను అభివృద్ధి చేసి తీరుతామని మాజీ ఎమ్మెల్యే కాసు చెప్పారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌బాషా, ఎంపీపీ కందుల జాను, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, అధికార ప్రతినిధి షేక్ జాకీర్‌హుస్సేన్, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కొట కృష్ణ, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, నగుబండి గురువులు, వందనపు వెంకట్రావమయ్య, మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, దేవళ్ల ప్రసన్నలక్ష్మీ, శ్రీరాం పోలు తదితరులున్నారు.

# ధర్నా విజయవంతం చేయండి

ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షురాలు బేబిరాణి



మాట్లాడుతున్న బేబిరాణి, ఎస్టీయూ నాయకులు

రెంటచింతల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 7 విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాను ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షురాలు బేబిరాణి కోరారు. శనివారం స్థానిక ఎస్టీయూ మండల శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇస్తానని హామీ నిచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుచేయలేదన్నారు. ఇప్పటివరకు ఆర్థికంగా ఎలాంటి ప్రయోజనం కల్పించలేదన్నారు. డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసే పనులు తగ్గించాలని, వెంటనే ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిసి విజయవాడలో ఈ ధర్నాను చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఎస్టీయూ సంఘ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఖుద్దుస్, సంఘం నాయకులు లేళ్ల శ్రీనివాసరావు, వెంకటేష్, భీముడు నాయక్, శ్రీను నాయక్, సిలార్ అహమ్మద్ పాల్గొన్నారు.

# మిర్చి సాగుపై రైతులు వెనుకంజ



మాదలలో సాగు చేసిన మిర్చి పంట

ముప్పాళ్ల: మిర్చి సాగుపై అన్నదాతలు ఆసక్తి చూపడం లేదు. వరుసగా రెండేళ్ల తీవ్ర నష్టాలు వస్తుండటంతో వెనకడుగు వేస్తున్నారు. పెట్టుబడి వ్యయం పెరగడం, ఎరువుల కొరత, కూలీల ధరలు రెట్టింపు కావడం, తెగుళ్ల నివారణకు ఖరీదైన పురుగు మందులు వాడాల్సి రావడంతో సాగు పరిస్థితి మరింత భారంగా మారింది. దీనికి తోడు గతేడాది పంటకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఎకరాకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

**ప్రత్యామ్నాయ పంటల వైపు చూపు**

తమది రైతు ప్రభుత్వం అని కూటమి నేతలు చెప్పడమే తప్పా ఆ దిశగా వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టలేదు. అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నా స్పందన లేదు. మిరప సాగులో రైతులు నష్టాలు చవి చూస్తున్నారు. బోరు బావుల కింద సాగు చేసే మిరప పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ఎక్కువ శాతం మక్కువ చూపుతున్నారు. మండలంలో గత ఏడాది 1,664 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 968 ఎకరాల్లో మాత్రమే మిర్చి పంట సాగు చేశారు.

**రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. మద్దతు ధరతో పాటు పంట నష్టపరిహారం అందించి ఆదుకుంది. సమయానికి రైతు భరోసా సాయం అందించి వెన్నుదన్నుగా నిలిచింది. సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు గ్రామంలోనే అందేలా సౌకర్యాలు కల్పించి, నకిలీలను అరికట్టింది. గతంలో మిర్చి క్వింటా రూ.20వేలు నుంచి రూ.25వేల వరకు ధర పలికింది. రెండేళ్ల నుంచి క్వింటా రూ. 8వేల నుంచి రూ.13వేలకు పడిపోయింది. మిర్చి రైతులు ఎన్నడూ లేని నష్టాలు ఈ రెండేళ్లలో చవిచూడాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ ఏడాది పంట నష్టపరిహారం అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అన్నదాతలు విమర్శిస్తున్నారు.

**ప్రభుత్వం నుంచి సహకారం కరువు**

రైతులు ఏ పంట వేసినా నష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోవడం, పెట్టుబడి సాయం చేయకపోవడం, గిట్టుబాటు ధర కల్పించి భరోసా కల్పించకపోవడం వెరసి రైతులు నష్టాల బాట పడాల్సిన పరిస్థితి నెలకొంది. మిర్చి పంటకు మొదటి నుంచి ఖరీదైన ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. తెగుళ్ల బెడద కూడా ఎక్కువ. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టాలి. పంట ఎక్కువగా సాగు చేసినా ధరలు పడిపోవడంతో నష్టాలు తప్పలేదు. దీంతో రైతులు అయోమయంలో పడిపోయారు. ఈ ఏడాది మిర్చి పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు. ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, అరటి, బొప్పాయి పంట సాగుకు మళ్లుతున్నారు.

# ధ్వంసమైన రోడ్లపై ప్రయాణికుల అవస్థలు

సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రవిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

అమరావతి: నియోజకవర్గంలో ధ్వంసమైన రోడ్లతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. రవిబాబు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా రోడ్ల నిర్మాణం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పుణ్య క్షేత్రమైన అమరావతికి దేశ విదేశాల నుంచి వచ్చే యాత్రికులు, ప్రయాణికులు, వాహనచోదకులు ధ్వంసమైన రోడ్లతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలం వచ్చిందంటే వాగులు పొంగి ఐదారు రోజులపాటు మద్దూరు వాగు వద్ద అమరావతి– విజయవాడ రాకపోకలను నిలిపి వేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో అనాటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి యాభై శాతం పనులు పూర్తి చేశారని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన కూటమి ప్రభుత్వం బ్రిడ్జి పనులు మరలా ప్రారంభించకపోవడం దారుణమని పేర్కొన్నారు. అమరావతి– బెల్లంకొండ డబుల్ రోడ్డు నిర్మాణాన్ని నాటి శాసనసభ్యుడు నంబూరు శంకరరావు రూ. 149 కోట్లతో చేపట్టి సగ భాగం పనులు పూర్తి చేసినట్లు వివరించారు. రోడ్లు పనులు సత్వరమే చేపట్టడంలో నేటి శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ వైఫల్యం చెందాడని విమర్శించారు. అమరావతి నుంచి క్రోసూరు, బెల్లంకొండ నుంచి పిడుగురాళ్ల వెళ్లాలన్నా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు, బ్రిడ్జి పనులు పూర్తిచేసి ప్రజలకు కష్టాలను తొలగించాలని రవిబాబు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బి. సూరిబాబు, నేతలు సయ్యద్ మొహిద్దీన్‌వలి, శంగారపాటి రాజకుమార్, ఎం. సుబ్రహ్మణ్యం నండూరి వెంకటేశ్వరరాజు, చెవుల మురారి, ఎస్కే నాగుల మీరా పాల్గొన్నారు

### ఘనంగా నిమజ్జన వేడుకలు

రెంటచింతల: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను శనివారం ఘనంగా నిమజ్జనం చేశారు. పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాలను మేళతాళాలతో, బాణసంచా కాలుస్తూ చిన్న పెద్ద తేడాలేకుండా ఊరేగిస్తూ కేరింతలు కొడుతూ సత్రశాల వద్ద కృష్ణానదిలో, కంభం పాడు పెద్దకాలువలో నిమజ్జనానికి తరలి వెళ్లారు. ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సత్రశాల వద్ద కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

### దుర్గి ఎంపీడీఓగా సుగుణ బాధ్యతలు స్వీకారం



దుర్గి: దుర్గి నూతన ఎంపీడీఓగా సుగుణ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శావల్యాపురం మండలంలోని వీఓపీఆర్డీగా పనిచేస్తూ ప్రమోషన్ పై దుర్గి మండలానికి వచ్చినట్లు ఆమె తెలిపారు. దుర్గి ఎంపీడీఓగా పనిచేసిన శివప్రసాద్ తిరిగి దుర్గి మండల ఏఓగా ఇక్కడే విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ అడ్మినిస్ట్రేషన్ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. పరిపాలన విషయంలో అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సెక్రటరీలకు సూచించారు. ఎంపీపీ సునీత సాయిశంకర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి బొకే ఇచ్చి పరిచయం చేసుకున్నారు.


### విద్యతోనే సమాజంలో మార్పు

ముప్పాళ్ల: విద్యతోనే సమాజం మారుతుందని కృష్ణాజిల్లా కార్ప్ డిప్యూటీ డైరెక్టర్ కె.బేబీ చెప్పారు. ముప్పాళ్లలో శనివారం బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ల సమావేశం నిర్వహించారు. కార్ప్ సంస్థ ఏరియా కోఆర్డినేటర్ కె.జగదీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బేబీ మాట్లాడారు. పేద పిల్లలను విద్యావంతులు చేసేందుకు బాలబాట నాలుగు అంశాలతో విద్యను అందిస్తోందని తెలిపారు. ఆటపాటలతో పాటుగా పెరటి తోటల పెంపకం ద్వారా స్వయం సహాయక జీవన విధానంతో కూడిన విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా డెప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు మాట్లాడారు. ఆర్గనైజర్లు పి.అరుణ, బి.మంజుల పాల్గొన్నారు.

### జీఎస్టీ తగ్గింపుపై అవగాహన అవసరం

సత్తెనపల్లి: జీఎస్టీ తగ్గింపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పణిదం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు తెలిపారు. పట్టణంలోని ఆప్కో షోరూం వద్ద శనివారం జీఎస్టీ తగ్గింపుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై 18 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించిందని తెలిపారు.

### జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి



నరసరావుపేట: జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జనవిజ్ఞాన వేదిక ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు తెలిపారు. ఎస్‌ఆర్‌కేటీ ప్రాథమిక పాఠశాలలో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం జంతు సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ బుజ్జిబాబు మాట్లాడుతూ జంతువులకు కూడా బ్రతికే హక్కు ఉందని వాటిని కాపాడుకోవడం సమాజ బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరు జంతు ప్రేమికులుగా మారినప్పుడు పర్యావరణ సమతుల్యతగా ఉంటుందని తెలిపారు. జంతువులను చంపే హక్కు మనకు లేదని అలాగే చంపితే కఠినమైన శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు మాస్కులు పంపిణీ చేసి జంతుసంరక్షణపై అవగాహన కల్పించారు. జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన 50 రకాల బాలసాహిత్య గ్రంథాలను బహూకరించారు. గార్ప్ సలహాదారు దాసరి చిట్టిబాబు, హెచ్‌ఎం ఎ.గురులింగం పాల్గొన్నారు.

# ఘనంగా ముక్త్యాలరాజా జయంతి వేడుకలు



ముక్త్యాలరాజా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేసీపీ జీఎం వెంకటరమణ, ఉద్యోగులు

విజయపురిసౌత్: శ్రీ రాజా వాసిరెడ్డి రామ గోపాల కృష్ణ మహేశ్వర ప్రసాద్ (ముక్త్యాలరాజా) 108వ జయంతి వేడుకలను శనివారం కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ ముక్త్యాలరాజా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీఎం వెంకటరమణ మాట్లాడుతూ ముక్త్యాలరాజా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి మూల పురుషుడు అని కొనియాడారు. ఆయన కృషి లేకపోతే సాగర్ ప్రాజెక్టు సాధ్యం అయ్యేది కాదన్నారు. ముక్త్యాలరాజా కృషితో సాగర్ ప్రాజెక్ట్ కింద గుంటూరు, ప్రకాశం, నల్గొండ, ఖమ్మం జిల్లాల రైతుల పంటల్లో సిరులు పండుతున్నాయని చెప్పారు. ఆనాడు భోస్లా కమిటీకి నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆవశ్యకతను తెలియజేసి ప్రాజెక్టు రూపకల్పనలో ముక్త్యాల రాజా చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీలు, యూనియన్ నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# నాగేశ్వరరావు మృతి బాధాకరం



సూదనబోయిన నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పీఆర్కే



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బి.ఏడుకొండలుకు పరామర్శ

వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సూదనబోయిన నాగేశ్వరరావు మృతి చెందటం బాధాకరమని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కండ్లకుంట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అన్నివిధాల తోడుగా ఉంటామని చెప్పారు.

**పలువురికి పరామర్శ...**

మాచర్ల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ నేత 25వార్డుకు చెందిన ఎం.శేఖర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి డిశ్చార్జి అయిన 15వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మాజీ పట్టణ అధ్యక్షుడు చందూరు వెంకటరోశయ్యను పరామర్శించి, యోగక్షేమాలను విచారించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గొట్టిముక్కల ఏడుకొండలును పీఆర్కే పరామర్శించారు.

# అంబేడ్కర్ విగ్రహ దహనం హేయం

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిలుకా జైపాల్

సత్తెనపల్లి: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టిన వారిని ప్రభుత్వం వెంటనే శిక్షించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిలుకా జైపాల్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి సర్కారులో దళితులపై నిత్యం దాష్టికాలేనని, దీనిలో భాగంగానే చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని పేర్కొన్నారు. ఈ ఘటనకు కారణమైన టీడీపీ నేత సతీష్ నాయుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితుల గ్రామ బహిష్కరణలు, అంబేడ్కర్ విగ్రహాలకు అపచారం నిత్య కృత్యమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దళిత ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతాడని తెలిపారు. అంబేడ్కర్ భావజాలాలపై టీడీపీ ఆది నుంచి విషం చిమ్ముతోందని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవం నిలబెట్టడానికి అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున విలువైన స్థలంలో రూ.450 కోట్లతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత విగ్రహాన్ని చూసి తట్టుకోలేక స్మృతి వనంలో లైటింగ్ తీసివేయించారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని, దళితుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా చూడాలని ఆయన కోరారు.

# దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రవిబాబు



మాట్లాడుతున్న రవిబాబు

సత్తెనపల్లి: అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి గంజిమాల రవిబాబు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు కలిసి శనివారం నిరసన తెలిపారు. దళిత బహుజన ఫ్రంట్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నందిగామ చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవిబాబు మాట్లాడారు. దళితులకు, నాయకులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. అంబేడ్కర్ విగ్రహం కాల్చడం అంటే దళితుల ఆత్మ గౌరవం కాల్చినట్టేనని ఆయన మండిపడ్డారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని తెలిపారు. దళిత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరబండి ఆంథోనీ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేవారు. సీనియర్ న్యాయవాది దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షంచాలని కోరారు. బహుజన సమాజ్ పార్టీ నియోజక వర్గ నాయకులు కుక్కమళ్ల దేవానంద్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాల వద్ద పోలీస్‌లు నిఘా నేత్రలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోడిరెక్క దేవదాసు, జూపల్లి పాల్, పెద్దింటి నాగేశ్వరరావు, పద్మారావు, నాయకులు మాదంశెట్టి వేదాద్రి, సిద్దిల మోహన్, శేఖర్, బహుజన సమాజ్ పార్టీ నాయకులు తలతోటి కోటేశ్వరరావు, మాలపాటి విజయ్ కుమార్, బండారు రవి, జై భీమ్‌రావు భారత్ పార్టీ నాయకులు జాన్‌బాబు, అంబేడ్కర్ ప్రజా సంఘం నాయకులు దావులూరి కోటేశ్వరరావు, అంబేడ్కర్ యువ జన సంఘం నాయకులు పాల్ రాజ్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కల్పించాలి

నరసరావుపేట రూరల్: ప్రకృతి సేద్యంపై రైతుల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమాన్ని రైతుల్లోకి తీసుకెళ్లే బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. 2025–26 సంవత్సరానికి 82,619 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులు వదిలి దేశీయ కషాయాల వాడటం వలన భూమి ఆరోగ్యంగా ఉండి ఆరోగ్యకరమైన ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. దీని వలన ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ప్రధాన పంటలతో పాటు అంతర పంటలతో పాటు, పంట క్షణ కోసం చుట్టూ జొన్న, సజ్జ వంటి గోడ పంటలను నాటాలని సూచించారు. పంటలపై క్రిమిసంహారకాలు, రసాయన ఎరువులు వాడకుండా ఆవు మూత్రం, పేడతో తయారు చేసిన కషాయాలు వాడటం వలన దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు.